
# ఫ్లాష్ బ్యాక్




పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

## రక్తకన్నీరు నాగభూషణంతో ప్రత్యేక ఇంటర్వ్యూ.
## (చలనచిత్ర, నవంబర్ 1973 సంచికనుంచి)

**ప్రశ్న:** మీ విజయం పాపులారిటీ మీద ఆధారపడిందా? పబ్లిసిటీ మీదనా?"

**సమాధానం:** పబ్లిసిటీ అంటే, మీ ఉద్దేశ్యంలో డిస్ట్రిబ్యూటర్లూ, నిర్మాతలూ యిచ్చే ప్రచారం అనుకుంటాను. మాలాంటి ఆర్టిస్టులకు వాళ్ళు యిచ్చే పబ్లిసిటీ అంతగా వుండదు. హీరో, హీరోయిన్లకు యిచ్చే పబ్లిసిటీ మాలాంటి వారికి దొరకదు. ఏ అడ్వర్టయిజ్‌మెంట్ అన్నా చూడండి. బొమ్మలో ఎక్కడో ఒక మూల చీమ తలకాయంత పిసరు మా తలకాయ కనిపిస్తూ వుంటుంది. అయితే మాకూ పబ్లిసిటీ వుంది. పాపులారిటీ వుంది. మేము చెప్పే డైలాగులు, నటన ప్రజలకు నచ్చి, ఆ నోటా ఆ నోటా ప్రాకి ప్రజలే పబ్లిసిటీ యిస్తారు. దానినుండి పాపులారిటీ లభిస్తుంది. దానిమీదనే మా విజయం ఆధారపడింది.



**ప్రశ్న:** మీ డైలాగులు ఆ నోటా ఆ నోటా ప్రాకడానికి ఏదైనా ఉదాహరణ యిస్తారా?

**సమాధానం:** దీనికి ఉదాహరణ కావాలంటే 'ప్రజానాయకుడు' చిత్రం తీసుకోండి. దానిలో "గాలి లేకుండా బ్రతకవచ్చు, కాఫీ లేకుండా బ్రతకవచ్చు , కానీ పదవి లేకుండా బ్రతకలేము" అన్న డైలాగు బ్రహ్మాండంగా పేలింది. అలాగే 'కథానాయకుడు' చిత్రంలో హీరో లంచం తీసుకోడని మరోపాత్ర నాకు చెపుతుంది.

దానికి సమాధానంగా "అంత పాపాత్ముడా?" అంటూ నేను వాడిన డైలాగు. ఇలాంటి డైలాగులెన్నో ఎన్నేళ్ళు గడిచినా గుర్తువుంటాయి. ఇవే నాలాంటి వాళ్ళకు పాపులారిటీ, పబ్లిసిటీ.

**ప్రశ్న:** మీరు ధరిస్తున్న పాత్రలపై మీ అభిప్రాయమేమిటి?

**సమాధానం:** నేను ఎక్కువగా వేస్తున్నది దుష్టపాత్రలే. అయినా నేను వాటిని 'కారికేచర్'చేస్తున్నాను. అంటే నేను ధరించేలాంటి పాత్రలు సమాజంలో వున్నవేనన్న పద్ధతిలో నేను వాటిని వ్యంగ్యంగా చిత్రీకరిస్తున్నాను. దీనిని ప్రజలు అర్థం చేసుకున్నారు కూడా. ఫలానా సినిమాలో నాగభూషం వేసిన పాత్ర ఫలానా వాడిది అని ప్రజలు అనుకుంటున్నారు. ఆ దృష్టిలో గనుక ప్రజలు ఆ పాత్రను చూడకపోయిన పక్షంలో ప్రజలు నన్ను ద్వేషించేవారు. స్త్రీలకూ, పిల్లలకూ నేనంటే జుగుప్స కలిగేది. నా పాత్రల యథార్థాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారు గనుకనే నా విషయంలో అలాంటిదేమీ లేదు పైగా నన్ను ఎక్కువగా అభిమానిస్తున్నది స్త్రీలు, చిన్న పిల్లలే.

**ప్రశ్న:** ఇకముందు ఎలాంటి పాత్రలు ధరించాలనుకుంటున్నారు? ఎందుకని?

**సమాధానం:** సంఘ వ్యతిరేక శక్తులూ ,దేశద్రోహులూ, దోపిడీ వర్గాలూ వీళ్ళకు సంబంధించిన పాత్రలు, వాటి మనస్తత్వాలూ ప్రజల ముందు పెడితే, వీళ్ళ విషయంలో ప్రజలు కొంత జాగరూకతతో వుంటారనీ, వాళ్ళు కూడా తమ నిజస్వరూపాలు ప్రజలముందు బయటపడతాయని కొంతైనా భయపడతారనీ భావించే యింతకాలం అలాంటి వేషాలు వేశాను. కానీ ఆ సంఘ వ్యతిరేక శక్తులు మానిందీ లేదు – ప్రజలు వాళ్ళను మార్చడానికి ప్రయత్నించిందీ లేదు. కాకపోతే అలాంటి పాత్రలు నా చేత వేయించుకుని నిర్మాతలు డబ్బు సంపాదించుకున్నారు. అలాంటి పాత్రలలో బాగా రాణిస్తాననే ఫాల్స్ నోషన్ సృష్టించి నేనూ డబ్బు సంపాదించుకున్నాను. దానితో విసుగు పుట్టి 'కారికేచర్స్' మానేసి 'కారెక్టర్స్' చేయాలనుకున్నాను. ఈ ప్రయత్నంలో ఎంతవరకు సఫలమౌతానో, ఎంతవరకు విఫలమౌతానో నిర్ణయించవలసింది ప్రజలే. వైవిధ్యంగల పాత్రలను ధరించకుండా ఒకే మూసలో వున్న కారికేచర్ పాత్రలను నేను యిలాగే కొనసాగిస్తే స్టేల్ అవుతానని నా భావన.

**నేను:** ఇంతవరకూ సమాధానాలు చెప్పినందుకు థాంక్స్. అయితే మరో చిన్న ప్రశ్న. దీనితో నా ఇంటర్వ్యూ ముగిస్తాను.

నాగభూషణంః నా ఇంటర్వ్యూ ముగిసిందనే అనుకుంటాను. అయినా అడగండి చెబుతాను.

**ప్రశ్నః** రాజకీయాలలో పర్సనాలిటీకల్ట్(వ్యక్తి పూజ)లాగానే సినిమాలలో సైతం పాపులారిటీ కల్ట్ (ప్రజాభిమానమనే ఆరాధన) పెరుగుతూ వుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు? ఇది నిజమేనా? అయితే దీనికి పరిష్కారమేమిటి?

**సమాధానం:** చిన్న ప్రశ్న అని చిక్కుల్లో పెట్టే ప్రశ్న వేశావు. దీనికి సమాధానం సినిమా లోకం అంటే అంటకుండా, రాజకీయాల్లో తలమునకలుగా వుండేవాళ్ళో, లేదా ప్రేక్షకులో చెప్పాలి. నా బోటివాడు మాత్రం కాదు. దీనిపై నేనే మిమ్మల్ని ప్రశ్నిస్తాను. నాకు సమాధానం చెప్పండి.

**నేను:** ఇది మరీ బాగుంది. నేను మిమ్మల్ని ఇంటర్వ్యూ చేయడానికి వస్తే, నన్ను ఇంటర్వ్యూ చేసేలాగున్నారు మీరు.

ఆయన: తప్పది. ఇది రెసిప్రోకల్. అంటే పరస్పర ఆదాన ప్రదానంలాంటిది.

**నాగభూషణంగారి ప్రశ్న:** అసలు పాపులారిటీ కల్ట్ అంటే అర్ధమేమిటో నాకు అర్ధమయ్యేలా చెప్పండి.

**సమాధానం:**అపారమైన ప్రజాభిమానంగల నటుడు అని ఊదరపెడుతుంటారు చూడండీ అలాంటిది. ప్రజాభిమానం సంపాదించడమనేది గొప్ప విషయమే. కానీ ఫలానా నటుణ్ణి లేక నటిని మాత్రమే ప్రజలు ఆరాధించి పూజిస్తారనీ, వాళ్ళుంటే కథా, కాకరగాయా లేకపోయినా చిత్రం జూబ్లీ హిట్టవుతుందనీ చేసే ప్రచారం.

**నాగభూషణం:** ఓహో అదా! అయితే ఈ ప్రచారానికి కారణమైన వాళ్ళనే అడగలేకపోయారా?

**నేను:** నిర్మాతగా పేరు వేసుకున్నా వేసుకోక పోయినా మీరూ చిత్ర నిర్మాణం ఆరంభించి నిర్మాతల్లో ఒకరయ్యారు గనుకనే ఆ ప్రశ్న మిమ్మల్ని అడుగుతున్నాను.

**నాగభూషణం:** ప్రజలు ఆరాధించే నటీనటులను వేసుకుంటే చిత్రం హిట్టయి డబ్బు బాగా వస్తుంది కదా?

**నేను:** ఆ వెంటనే వాళ్ళు డిమాండ్ పెంచేస్తున్నారు. దానితో చిత్ర నిర్మాణ వ్యయం పెరిగిందని చిన్న నిర్మాతలు గగ్గోలు పెడుతున్నారు.

**నాగభూషణం:** బాబూ! ఈ ప్రశ్నకు సమాధానం ఎంతకూ తెగదు. నీవు చెప్పింది నిజమే. ఇది ఓ విచిత్ర వలయం – మేము నటించిన (నటుడిగా చెపుతున్నాను) చిత్రమేదన్నా హిట్టయితే మేము రేట్లు పెంచేస్తున్నాము. వాటితో చిత్ర నిర్మాతలు బాధపడుతున్నారు. పరిశ్రమ మీద ప్రభుత్వం వేసే శీతకన్ను, పెంచే పన్నులు సైతం నిర్మాణ వ్యయం మితిమీరి పెరగడానికి కారణాలే. ఇవన్నీ పోయి పరిశ్రమ పదికాలాలపాటు బాగుపడాలంటే ఇటు పరిశ్రమలోనివారూ, అటు ప్రభుత్వంలోనివారూ చిత్తశుద్ధితో కృషిచేయాలి. నీవంటున్నావే పాపులారిటీకల్ట్ అని అది నిజంగా వుండిపోవాలనుకుంటే ప్రజలు ఒక చిత్రంలో కథాబలం చూసి విజయవంతం చేయాలి. తారాబలం చూసి విజయవంతం చేసినంతవరకూ ఈ పాట్లు తప్పవు. పదినిమిషాలని చాలా టైమ్ తీసుకున్నావు .వస్తా. అవతల అవుట్‌డోర్ షూటింగు వాళ్ళు కాచుకుని వున్నారు. మళ్ళీ కలుద్దాం శలవు" అంటూ హడావిడిగా వెళ్ళిపోయారు కారెక్టర్ యాక్టర్ ఐ మీన్ 'కారికేచర్' యాక్టర్ రక్తకన్నీరు నాగభూషం.

మా ప్రత్యేకప్రతినిధి

Post your comments